# పరాభవం

★ శ్రీ భాగవతుల రామజోగారావు.

ఆనాడాదివారం. ఇంటివద్దనే కూర్చుని "కావలెను కాలము" (Wanted columns) ఎగాదిగా చూసేను. మనకీ అనుకూలించిన వేమీలేకపోగా పేపరు పారవేయబోతూవుండగా నాకళ్ళు ఆటంకము గలిగించినాయి. పేపరు ఆఖరుపేజిలో 'We offer our heartiest congratulations to Mr. P. V. Rao, M. A., on his promotion as collector- His Well-wishers' అనివుంది.

అది చూచుట తడవుగా సంభ్రమాశ్చర్యాలు నన్నావరించాయి. వెంకట్రావు రాజమండ్రి కాపురస్థుడు. మేమిద్దరము బాల్యమిత్రులం. సహపాఠకులం. స్కూలుఫైనల్ మూడవ దండయాత్రతో కృతార్థుడై, తండ్రిలుబ్ధత్వము వల్లనో, సవతితల్లి పోరువల్లనో, అతని తెలివితేటలవల్లనో, విద్యాసాగరమునకు స్వస్తిజెప్పాడు. నాల్గు సంవత్సరములైంది అతనిని నే చూసి. మావాడికి అఖండమైన తెలివితేటలున్నాయి. లెఖ్ఖలు గ్రూపులో మావాడు శుద్ధబుద్ధావతారం. $(a+b^2)$ ఎంతారా అని గ్రూపుమేష్టరుగారు ప్రశ్నించితే $a^2+b^2$ అని మావాడు మొదలెట్టేసరికి, మేష్టరుగారు ఆ లెక్కల ధోరణిలోనే తిట్టడానికి ఆరంభించేవారు. అది నాకింకా జ్ఞాపకంవున్నది. అలాంటి అఖండుడు ఎం. ఏ. ఎలా ప్యాసైనాడని నాకాశ్చర్యం వేసింది. తరువాత క్రమంగా బుద్ధిమంతుడు అయాడు కాబోలునని తృప్తిపడ్డాను.

నాల్గుగంటలకి షికారుకై బయల్దేరాను. చిన్ననాటి చర్యలన్నీ జ్ఞాపకమొచ్చాయి. మా వెంకట్రావుకి కవిత్వమంటే ప్రాణం. యతిప్రాసలు కుదరని పద్యాలు కూర్చేవాడు. పేరూఊరూ లేని పత్రికలో ప్రచురింపబడ్డాయని చెప్పేటప్పటికి పరమానందభరితుడయ్యేవాడు. తలంతా ఆలోచనలతో నిండిపోయింది. మా వెంకడే కలక్టరైతే, "వాంటెడ్ కాలమ్సు" చూడ నక్కరలేదనుకున్నాను. వాడు కలక్టరు పదవిలోవుండి కూడా నాకొక గుమాస్తావుద్యోగమునైనా ఇప్పించడా అనుకున్నాను.

ఆలోచనలతో సాయంకాలమైంది. కర్షకులు భూదేవిని మరి బాధించకుండా నాగళ్ళుపట్టుకొని గృహోన్ముఖులవుతున్నారు. శకుంత సంతానములు తమతమగూండ్లను జేరుకొంటున్నాయి. ఇంక నీవుకూడా నీగూడుజేరుకోన్నట్లు సూర్యుడు పశ్చిమసముద్రంలో దుమికాడు. శశాంకుడు [illegible] ప్రకాశమానముతో తారలను వెక్కిరిస్తున్నాడు. ఆరాత్రి సరిగా నిద్రపట్టలేదు. గుమాస్తాగా ప్రవేశించి మేజెస్ట్రేటు, డిప్యూటీకలక్టరు తరువాత మావాడిలానే కలక్టరునైపోతానని అనుకున్నాను. పేలపిండి కథలో బ్రాహ్మణునిలా నా కోరికలకంతు లేకపోయింది. మరునాడే మిత్రుని కలసికొనడానికని బయలుదేరాలని నిశ్చయించాను. రైలుమీద పోవడమా లేక బస్సుమీదపోవడమా అన్నసమస్య పరిష్కారమయిందికాదు. రైలుమీదనైతే కూర్చుండటకైనా స్థలము దొరుకుట దుర్లభం, బస్సుమీదనైతే ఎక్కడకక్కడ ప్రాణంపోతుంది. చివరకు రైలుమీద పోవుటకే నిశ్చయించాను.

తెల్లవారింది. ప్రొద్దుట యథావిధులన్నీ జరిపి రాజమండ్రి ప్రయాణమయ్యాను. ప్రొద్దుటే నడిచితే ఆరోగ్యమని ఐదుమైళ్ళ దూరమైనా లెఖ్కజేయక కాలినడకనే ష్టేషనుకి బయల్దేరాను. ష్టేషను చేరిన తరువాతనే పోయేబండి మూడు గంటలు ఆలస్యమని తెలిసింది. ఏమీతోచక తోకతెగిననక్కవలె తిరుగుతూండగా మావూరి సుబ్బయ్య కలిసాడు.

మేము బాతాఖానీ చేస్తూవుండగానే సుబ్బయ్యగారు మూడణాలకిల్లీలు పదమూడణాల మిఠాయి ఆరగించేడు. ఇదంతా చూస్తూ నానోరుండకనుకోండి. నాకివ్వక తానే తినేస్తూవున్నాడన్న రోషంవల్లననుకోండి నేను "సుబ్బయ్యగారు! రాయలసీమ క్షామంతో అచ్చటిప్రజలు మాడిపోతున్నారు. ఈ వృథాగా ఖర్చుపెట్టినరూపాయి క్షామనివారణ నిధికిచ్చిన మీకెంతో పుణ్యముండేది' అన్నాను. అంతటితో అతడు తారామండలానికి లేవగానే నోరుమూసికొని బండివచ్చేవేళ కావడంవల్ల టిక్కెట్టుకై వెళ్ళిపోయాడు.

రైలువచ్చింది. ష్టేషనులో ప్రజలు తీర్థప్రజలావున్నారు. ఏపెట్టెలోను ఖాళీలేదు. ఎలానో ఒక పెట్టెఎక్కాను. రెండువందలమైళ్ళ ప్రయాణంలోనూ ఒక్కసారైనా కూర్చుండలేదు. ఆస్థితి చూస్తే చిన్నతనంలో మేష్టరు కూర్చుండబెట్టిన గోడకుర్చీ జ్ఞాపకమొచ్చింది. మిలిటరీ సౌకర్యాలకై రైలు ఎచ్చటకచ్చటాగుటచేత మా బండి 15 గంటల లేటుతో రాజమండ్రి చేరుకున్నది.

రైలుదిగ్గానే సరాసరి మా బంధువులింటికి వెళ్ళి భోజనంచేసి కలక్టరు కచ్చేరికి బయల్దేరాను. గుమాస్తాలతో జోక్యం కల్గించుకోకుండా. (లోనికి రాకూడదు) అనిఉన్నా నౌకరు విజిటింగ్ కార్డు అడిగినా వినక, తిన్నగాలోపలికి వెళ్ళి కలక్టరుగారి గదే సమీపించాను. అతడు పుల్‌సూటు వేసికొనివున్నాడు. ఆ ఆనందంలో ఆ నమ్మకంలో 'ఓరే వెంకా! అదృష్టం అంటే నీదేరా అదృష్టం. ఉన్నతమైన కలక్టరుపదవి పొందేవు. నన్ను మరచిపోయావా' అని గ్రుక్కతిరగకుండా నా హృదయాన్ని బయటపెట్టాను.

నా వేషమంతా అతడుచూసి పిచ్చివాడనుకొని "డామిట్" ఈన్యూసెన్సంతా యేమిటి ఎవరి పెరిష్మన్‌మీద లోపలికొచ్చావు? గెటవుట్' అన్నాడు. నేను నిర్ఘాంతపోయాను. మావెంకడు నన్ను మరచి పోయాడనుకున్నాను. కాలం శత్రువులను మిత్రులను, మిత్రులిని శత్రువులుగాను మార్చుతుందనుకున్నాను. మరియొకసారి అతడు గర్జించగా, ఇంక అర్ధచంద్రప్రయోగం తప్పదని భావించో లేక మిత్రుడు పరాభవించినందుల కీర్ష్యతోనో బయటికి నడచాను. తొలి రెండుదినములు గూడ మావెంకడు కళ్ళకి కట్టినట్లువుండడంవల్ల ఆకలక్టరుని సరిగా పోల్చుకోలేదు కాని అలా వస్తూవుండగా త్రోవలో ఏదో పరిచితకంఠము వినిపించింది. దానితో తలఎత్తాను. ఎదుట మా వెంకడి దివ్య కురూపి విగ్రహం ప్రత్యక్షం!

'ఎప్పుడురావడం' అన్నాడు.

'ఇప్పుడే' అన్నా ఆశ్చర్యంతో.

'ఇంత చిక్కిపోయావేం' అన్నాను.

'ఈవూరిలో వారాలుచేస్తూ వుద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను' అన్నాడు. వీడిఖర్మం ఏంకాలింది. వారాలు చేసుకొన్నంత గతి ఎందుకు పట్టిందనుకొని,

'నిన్ను కాల్చినంతడబ్బుందికదా, నీకు వారాలు చేసికోవలసినంత ఖర్మం ఏండా' అన్నాను.

'నాకు చదువుచెప్పిస్తానని దగాచేసి మాసవతితల్లి డబ్బంతా పట్టుకొనిపోయింది' అన్నాడు హీనస్వరంతో.

నేనుకూడా నాకథనంతా 'తు చ'లు తప్పకుండా వాక్రుచ్చేను. వాడు నవ్వి "నువ్వుచూసిన కలక్టరు మహారాష్ట్రుడు వాళ్ళకిగూడా మనవలెనే పేరాఖరున 'రావు' అనివుంటుంది. నేనెలాగునైతే "పోలసు వెంకటరావు"ను పి. వి. రావు చేశానో ఆలాగునే అతనిపేరుగూడ యేదో అయివుంటే అతడుగూడ పి. వి. రావు చేసుకున్నాడు.

మిత్రుని దుర్దశకు విచారిస్తూ, నా పరాభవానికి సిగ్గుపడుతూ, ఇంటినుండి బయల్దేరినపుడు కనిపించిన నల్లపిల్లిని తిట్టుకొంటూ ఇంటికివెళ్ళకుండా ష్టేషనుకొచ్చేసాను.

నాకొరకే వేచివున్నట్లు మైలుంది ప్లాటుఫారం మీద. వెంటనే తత్తరపాటుతో మైలెక్కి టిక్కట్టు లేనందున దోవలో యమధర్మరాజైన టిక్కట్టు కలక్టరు ధర్మాన దిగి, మరునాటి సాయంకాలమునకు స్వగృహం చేరుకొన్నాను.

వీధిగుమ్మం ఎక్కుతూండగానే మా అమ్మ.

'ఉద్యోగం అయిందిరా నాయనా' అంది.

'ఈజన్మలో యే యుద్యోగం ఇవ్వను. మళ్ళీజన్మలో కలక్టరుద్యోగాన్నే ఇస్తాను' అని దేవుడన్నాడని అన్నాను నిట్టూర్పుతో.

ఈ గొడవేమీ బోధపడక మా అమ్మ నా మోము చూస్తూ కూర్చుంది.